
ఓం శ్రీసాయిరాం

శ్రీసాయి సుదర్శనగీత

స్థితి పటలం



ఓం శ్రీ పరమాత్మనే నమః

సాయి శివహరి ఓం

శ్రీసాయి సుదర్శన గీత

అష్టమ అధ్యాయము — అక్షర బ్రహ్మ యోగము — సర్వ దుఃఖోప హరణం

(1) (10-10; నలభై రెండవ రోజు)

| | |
|---|---|
| 1. | పిడికెడు బిక్ష కోరిన — పిలిచి లక్షల నిత్తునే గాని ..నింత కొకింత నిత్తు నొకింత గోరక<br>కోరిన ఉన్నది కొండంత గని — తట్టల తప్పుకెళ్ళు....! |
| 2. | నీ ఇష్టము కొద్ది నిచ్చెద ఎటొచ్చి, నిచ్చిన దానికి నీ వర్షుండవో కాదో<br>నొకింత యోచింతము ఏడుపేటికి — ఏడవకు కన్నా, నేనున్నా సాయి శరణన్నా....! |
| 3. | కోరినదిత్తు నంటిగా, ఏటికి చేసెదవు పాప సంచితముల్, వాంఛలు తీర్చుటే గదా !<br>నీ మోహము ! పంచితముల్  చల్లినన్ పోవునా పాపంబుల్, సాయినాథుండ నేను....! |
| 4. | పరుల కిచ్చితినని నీ వేడ్వనేల ?  ఎవరి కెంత పెట్టితివో కిందటి జన్మ నీ జన్మ కంతే పుట్టున్,<br>నీ కున్నది నీకు చాలదా పరమార్థంబు కోరక నింత పతితుడ వైతివేమి....! |

| | |
|---|---|
| 5. | కనుమా అంతటన్ సాయినాథుని చెట్టుకున్, పుట్టకున్ మొక్కనేల<br>నీ పాప ఖర్మంబులకు నను కర్తను చేసెదవేల నీ పొట్టకు నే పెట్ట నంటినా....! |
| 6. | పుణ్యముల్ దూరమంటినా — అన్నత మూడ మంటినా... వింతలు గాదే నీ చేష్టలు — విని భరింతునే<br>నీ విధి తీరకున్నది — వినిపింప నేల — నా సాయిగీత మార్చబోదేది నీ రాత....! |
| 7. | అప్పులు చేసి మేడలు కట్టమంటినా ! ఒప్పుగా పది కాసులున్న పేదలకు పెట్టమంటి !<br>పసిడి కిరీటం అడగ లేదే, నొక్కి చెప్పిన వినవు నరుడా నీ నుదిటి రాత తీర్చ నెవరి తరము....! |
| 8. | అలగకు చెప్పితినని, ఎంతని ఓర్చుదు నీ గుణముల్ సుంతైన విడవవే? నా సుద్దులు నీకు నచ్చునే !<br>సూకరము పావనమైన పదముల్ పట్ట నేర్చునా....!<br>తెలిసీ, తెలియని మూర్ఖ భక్తుడా, ఇక చెప్పను నీకు.... విసిగి బోతి....! |
| 9. | కన్నులన్ నను గాంచు నీ బ్రతుకు నా కరములందుంచు<br>రథము నడిపింతు కడదాకా నీ కన్నీళ్లు తుడిచి....! |
| 10. | పాపముల్ బోవ పరుగున రా శిరిడీకి ! పండరీ వాసుండ సాయినాథుండ....! |
| 11. | కనిపింతు, కవ్వింతు, కన్నీళ్లు తుడిపింతు, ఆడింతు, పాలింతు అన్ని నేనవుదు<br>ఎలుగెత్తి చాటిన పదే, పదే పల్కిన పాలింతు ప్రభువునై ఆలింతు స్వామినై....! |
| 12. | పిల్లిని, బల్లిని, తొండను నేనే ..కొండను, బండను నీ అండను నేనే ..<br>ఏడు కొండలపై వెంకన్న నేనే..సింహాద్రిపై వెలుగు అప్పన్న నేనే చెప్పన్న !<br>దేశాల ఒప్పన్న నేనే ..ఏ రూపెత్తినా, ఏ పేరు పిలిచినా పలికేది నేనే....! |
| 13. | శ్రీసాయినాథుండ ఆ శేషతల్పుండ .. పరిగెత్తి, పరిగెత్తి పాలుతాగే కన్న నిల్చొని నీళ్ల తాగుటయే మిన్న<br>పాడు దారులపడి చెడిపోకు నీవు, పడిపోకు పడిపోకు భవజలధి లోన !<br>నీ అండ నేనున్న శ్రీసాయినాథుండ....! |
| 14. | పిలిచిన పలికేటి దైవము నేనైతే ..కలతేల వదలవు, కదను తొక్కవేల....! |
| 15. | కథలు చెప్పిన నేను, కావ్యంబుల నేను, మంచి చెప్పిన నేను మనసు నిల్పిన నేను<br>గుర్తింప కున్నావు గుణపాఠ మేదో నీ అండ నేనున్న సాయినాథుండ....! |
| 16. | సంసారమే లేదు విశ్వసంసారి నయ్యాను, సన్యాసి నయ్యాను, సర్వం త్యజించాను..సద్భక్తుల, సద్భక్తుల<br>వదల లేకున్నాను చెప్పింది వినుటకే చెవులుండె నయ్యా బంధాలుండి బాధించనయ్యా....! |
| 17. | చేసి చూపించెద నీ చేత.. ఛేదింతు బంధాన్ని రాముడని ఏడ్చిన, దేవుడని ఏడ్చిన<br>వినిపించు కోనిక శ్రీసాయి నాథుండ విశ్వ పరిపాలకుండ....! |
| 18. | శ్రీసాయి లీలలు, ఈ స్వామి చేతలు, కథామృతాలు, కమనీయ గాధలు వినితరించుట<br>నీకు తెలియ రాకున్న..పడిపోవుదు గదన్న నధమ పాతాళాన ! నీ అండ నేనుండ శ్రీసాయి నాథుండ....! |

| | |
|---|---|
| 19. | రావో నను చేరలేవో — దిన, దినంబున నీ బలంబు నే లేల క్షీణించన్..మనసు మారి నను చేరలేక క్షోభించెన్.... దిన దిన గండం ఈ బ్రతుకున నాలోచింతువేల వత్సరముల్...! |
| 20. | మురిపించు నీ బ్రతుకు మూన్నాళ్ల ముచ్చట నోయి పిదప పుడమిలో కలవక పోదే ! క్షణమైనా విడవక, ఘడియైన గడపక, భజనలో, పాటలో, మాటలో, ఆటలో, నామము పలుకులో, పిలుపులో, తలపులో, తనువులో, సాయి నామామృత ధారలు గ్రోలుమే....! |

(2) (11-10; నలభై మూడవ రోజు)

| | |
|---|---|
| 21. | ఈ అక్షరముల విద్య కుక్షి నింపంగా... భక్షించు బిక్షమా.. ఆర్జించు జ్ఞానమా ఏమిరా నీ బుద్ధి, ఇపుడవునురా శుద్ధి....! |
| 22. | చెప్పింది చెవులకా ! పట్టించు నీ మనసుకు మెప్పించు పదిమంది పశు, పక్షుల కన్న నీవేమి మిన్న నీ బ్రతుకు నీకున్న ఘనయేమిటన్న....! |
| 23. | ఏ బడిన, ఏ చదివి, ఏ విద్య నేర్చే..? ఎవరేమి చెప్పిరి బ్రతుకు ఈదంగ ఏమిరా నీ కుక్షి బ్రహ్మాండమే నిండంగా నిండునా ఎపుడైన చూతునా నిన్ను....! |
| 24. | వేదాల సారం - సంగీత జ్ఞానం.... ఉపనిషత్తుల నేను ఉర్విలో బోధింతు నాకన్న నీకున్న గురువెవరు మిన్న పంచోపచారం పంచ భూతోప సారం....! |
| 25. | పంచ పూజలు చెప్పి — పలికింతు నేను .. బ్రహ్మ భాష్యం చెపుతూ బ్రహ్మైక సారం ఆనందో బ్రహ్మ అవనంత దోచు —ఇది గీతోపసారం నీ సాయి చెప్పిన వేదం....! |
| 26. | ఇంతకన్న నేనేమి చెప్పేది ..పాలలో వెన్నలా నీ హృదిలోనే ఉన్నాను మనసుంచి చూసుకో కనిపింతునన్నాను .. కథలు చెప్పకు నాకు నీ కను తెరిపింతు....! |
| 27. | ఎవరి ననుకొన్నావు ఏమి చెబుతున్నావు..కుంటి సాకులు చెప్ప తుడవనా నీ కన్నీరు ఇంగితం నీకుంటే ఇది విని తెలుసుకో....! |
| 28. | ఇంద్రియ అశ్వంబులను కట్టు.... కళ్లాలు నీ చేత బట్టు.... వాంఛా పూరితుడవై వంగి చూసితివా పడిపోదువవురా నీ దారి ఏదారి, ఏ అథమ పాతాళాల పడి అలమటింతువో నేనుండ నీ అండ శ్రీసాయి నాథుండ....! |
| 29. | ఎవరురా నాకన్న నీకున్న శత్రువులు, ఊక దంపుడు ఆలోచన నేల చేసెదవు నీకున్న నీ మనసే నీ ఏకైక శత్రువు...నామది ఎంచితివే అది నీకు మిత్రుండు....! |
| 30. | అద్దముపై మురికిలా అద్దింది నీ మనసు తుడువుము తుడువుము ఇది నీకు తరుణం నీ మనసే నీకు అది మిత్రుండగును సర్వజగతి సమవర్తిగా దోచు....! |
| 31. | అడుగడుగు నేనున్న అడిగి చుడన్నా ..ఇది వేదాల సారం ఇది బ్రహ్మ వేదం |

| | |
|---|---|
| | సాయినాథుని గీత విని చెడిన వారెవరు..విని బాగు పడకున్న నిన్నిడవ నేను....! |
| 32. | దీవింతు, దీవింతు, దీపింతు వేని..పరబ్రహ్మనై పది కాలాల పాటు<br>పదిమంది బ్రతికిత్తు నీ నీడ బాటు..ఇది వేద, వేదాల సారం వాద, వాదాల వేదం....! |
| 33. | ఇంకేమి చెప్పేది ఓ చిన్ని కన్న ! ఇన్ని చెప్పిన మనసు మండుటెండై పడునా,<br>పడనేల ఆ మిడిసిపాటు..అది వదులు అహం బ్రహ్మ, ననుజేరు నవ బ్రహ్మే....! |
| 34. | శ్రీ శిరిడీ వాసుండ నీ పాండురంగడై..శ్రీసాయినాథుండై ఆ శేషతల్ప శాయినై<br>కల్పాల, కల్పాల పవళించి యుంటి..నీ ఆత్మకై, నేను ఈ పరమాత్మను చేరునందాక....! |
| 35. | ఇది గీతాల యజ్ఞం యజ్ఞాల సారం..విజ్ఞాన సుజ్ఞాన వేద వాఙ్మయ ఉపనిషత్తుల<br>నమకాల, చమకాల, గమకాల తడబాటు పడకుండ..నడిపించు సాయిగీతానువాదం....! |

(3) (12-10; నలభై నాలుగవ రోజు)

| | |
|---|---|
| 36. | నిన్నున్ నీవు తెలుసుకొన గలవేని..నన్నున్ నీలో కనుగొన గలవు<br>నీవన్నన్, నహంకారమున అతివేదన..దురాశ దుఃఖం నిరాశ విషాగ్ని జ్వాలలున్ గావు....! |
| 37. | నీవన్న నీవెవరో చూడు పరికించి చూడు ..నీవన్న నీమన్న దేహమవుదువో? కాదో దేహమున్ వదలి<br>ఆత్మగా భాసింతు భావించ నీవు..ఆ ఆత్మయే దేహంబు జొచ్చి, నాది నేనని ననుకొందువేమో....! |
| 38. | దేహంబు నశించి ఆత్మనై నిలిచేవు..నశించు దేహంబు నాదియని తలిచేవు<br>నా భావమందుని నన్నరయ నేర్చితివేని..బ్రహ్మన్ జేరుట బ్రహ్మాండ మేమిగాదు....! |
| 39. | నాది నాదన్న దేదో నీది కాదు, నీది నీదన్న దంతా నాది కాదే !<br>కదళీ ఫలముపై తొక్క తీసిన పగిది ఆత్మ జ్ఞానము నీకు విప్పి మరి చెప్పితిని గాదే....! |
| 40. | ముందు ఇపుడు చెప్పు, నీవెవరో మున్ముందు చెప్పు, దేహమా? మూడు మూరలు ముక్కలై పోయేటిది<br>ఆత్మయా నఖండ జ్యోతియై నిశ్చలత వెలిగేది.. వివరించి చెప్పితి విని ముందు తరియించు<br>ముందు నీవెవరో చెప్పు, ఆపై కనువిప్పు....! |
| 41. | నీకై దిగివచ్చి నీ ముందు నిలిచిన..నా మాటలకున్ నీవు మరిగి పోనేల?<br>బడబానలమైన నీ బ్రతుకు తాపాలు దీర్చ..భగవదాశ్రితమైన భక్తులకు భక్తాశ్రితుడై భగవంతుడొచ్చె....! |
| 42. | ఆశ్రిత మందార — భక్తవత్సల..మీ హితముకై కోరి నేను ఈ కతము వచ్చితి..పాలించుటయే గాదు<br>లాలించు పెద్దనై..ఆలించు మీ మొరలు, ఆర్తత్రాణ రక్షనై..ముజ్జగముల పాలించు — జనకుండనై....! |
| 43. | పద పదమును పరమ వివరించి చెప్పితి..మీ పదము దివ్య పదము దారి చూపించ నెంచితి....! |
| 44. | జాగేల, జాగేల, జనకుండ జేర..జన్మ జన్మల ఈ జాగరణ లేల? నిరీక్షణ లేల..<br>నిర్వికల్ప సమాధులే జేర..క్షణికమైన నశియించు బ్రతుకులో ఏ పాటి మాధుర్య మున్నదో....! |

| | |
|---|---|
| 45. | మరి నిలిచి, మది విడిచి పరికించి చెప్పు..భక్తాశ్రితులైన భగవంతుడై భక్తుల కొరకు నేను దిగి వచ్చినాను<br>చెప్పింది చేయవు — చేసేది చెప్పవు..చెప్పినా వినకున్న — చెడిపోవుదవురా....! |
| 46. | నకిలీల బ్రతుకేల ఈ నాటక, బూటకంలీల..భగవంతు సేవలో గానా బజానాల,<br>కానుకల గలగలలు, కర్పూర హారతులు, కానోపు దండల్..మనసున్న నీకు<br>మనస్ఫూర్తిగ చేసేటి సాష్టాంగ నమస్కారం చాలు..పూజలలో గూడ పురుషార్థమున్నదా ! ఆడంబరాలలో<br>ఆంతర్యమేమో....! |
| 47. | నువు చేయు పూజలకు అరువు బేరాలా ! నగదు సొమ్మే గాని, నకిలీలు లేవు నా దగ్గరేపాటి,<br>మీ వ్యాపార మేపాటి, పది లక్షల నీకై నేను ఇస్తే పది కొబ్బరికాయల కొట్టంగ నేర్తువే..<br>అనుకున్న దిస్తేనే — ఆపైన నీకిస్తా....! |
| 48. | నీ వడ్డీ భేష్ సరుగుల్ల నాకొద్దు..అడ్డాల నాడే నా బిడ్డ, నీ గడసరి గుణములో నే చెడ్డ<br>ఇంకేటి నీ బాగు, ఆ పొంగేటి వాగులో పొరలి దొర్లించిన..బురద గుంటలలోన నిను పొర్లించిన....! |
| 49. | నీ గుణమే గుడిచేటి గుణమే గాక..నా పాదాల ముగిసేటి బ్రతుకులే కావు<br>భగవంతుడే వచ్చి భక్తాశ్రితుడై..భంగపడి చెప్పిన నీ దొంగ బతుకులు మారు ఏ పాటికి....! |
| 50. | జలతారు వస్త్రాలు — మెచ్చి మీకివ్వంగ..వచ్చి నే కూర్చున్న కల్పవృక్షము పగిది<br>చింకి పాతల నేరు నీ ముచ్చు ముఖమునకు..నేనిచ్చు అదృష్టం నీ కెందుగలదు....! |
| 51. | పుట్టి మునిగిననాడు పట్టెనో ఏ గతి..కుక్క ముట్టిన కుండ బ్రతుకవును ఏ పగిదో !<br>చెప్పిన సూక్తుల్ చెప్పకుండా నేను..చెప్పితిన్, చెప్పితిన్, చెప్పి నే నలసితిన్....! |
| 52. | దొమ్మటి గుడిసెలన్ దూరేటి బుద్ధి..దొరుకునా నీకు ఈ హరి శ్రీ హరి సేవ,<br>శ్రీరంగనీతుల్ నీకు నే చెప్పనేల, చింతల, అతుకుల బొంతల్,<br>చిక్కుల తొక్కుల్ తినెడి నీ బ్రతుకు పండించ నీకేటి నువు ఫో....! |
| 53. | అహంకార మొదలు - అతి ఆశ నొదులు; అతి కాంక్షలు వద్దు - అతి వాంఛలు వద్దు<br>అతిగ నేమి వద్దు — మితిగా ఉండు; దానాలు ధర్మాలు చేయకుండిన మాన<br>పాపాలు, ఖర్మాలు చేయకుండుటే పుణ్యం; నిశ్చలత నీవుంటే వేయి జన్మల కొచ్చు పుణ్యాల ఫలమే....! |
| 54. | బండైన పగులును, మోడైనా బ్రతుకును, ఇనుమైనా కాలును, మిన్నైనా వంగును<br>జలదంత కరుగును, అగ్నిఅయిన భరింతును..భక్తా, నీ మూర్ఖపు మనసు మరలింప నేర్తునా...! |
| 55. | భవజలధిలో నీవు బడి పోక మున్నే..భక్తశ్రితుడైన భగవంతుడే వచ్చె<br>భగవదాశ్రితులైన భక్తుల కొరకు..భరియింప నేర్చితినే బ్రతుకు భారంబు....! |
| 56. | చెపుము, చెపుము ఇపుడెవరో చెపుము..అవలీలగా నేను అర్థమై పోతునే వ్యర్థమా..<br>నీ బుర్ర అర్థాల నేర్తునా? భక్తాశ్రితుడైన భగవంతుడ నేను..భగదాశ్రితులైన భక్తులే మీరు....! |

| | |
|---|---|
| 57. | నేనంటే నేనే, నీవంటే నీవే..ఇది కాదు అర్థం — బ్రతుకింకేటికి వ్యర్థం<br>నే పరమాత్మ స్వరూపుండ — నీవు ఆత్మ రూపుండ..రయమున హరిజేర లయింతు సత్వరము....! |
| 58. | భావనామయ జగతిలో భక్తుండవై, సాయిభక్తుండవై.. బంధ ముక్తుండవై, భక్త రక్తుండవై<br>భగవత్ భక్తుండవై భాసిల్లదవేని.. సర్వ సంసార సంకెళ్ల సడలించి సాయినారాయణ స్వరూపులై..<br>నిలుతురే సంపూర్ణ జ్యోతులై సద్భక్తులై....! |
| 59. | రంగ, రంగ, రంగాయని అన్న..రంగ, రంగ వైభవంబునన్ భక్త శృంగార, సర్వ సౌభాగ్యాల శ్రీరంగమై<br>మిమ్ములన్ జేర్తున్ ఆ పాండురంగ పదములందున్....! |
| 60. | ఆనందో బ్రహ్మ వవుచు అనెదవేని..పరమంతా ఇహమంతా బ్రహ్మ స్వరూపమై కన్పించు గాదే<br>నీ కనులకున్ ! కావలెనా, ఇంతకంటే కలిమిన్ నీకున్....! |
| 61. | చింతల్, చెంతన్ చేరక — పాప చింతనల్ చేయక..పరబ్రహ్మను కను దారిన్ — కనుగొను ననుగను<br>సృష్టంతన్ పరమేశ్వరుని — పుష్టిని గను..స్పష్టమై కన్పించున్ — అవనంతా ఆనందో బ్రహ్మగా....! |
| 62. | నలుసు నుండి నభోనాంతరము..భువనంబులు, భవనంబులు సర్వప్రాణుల్<br>ఆ సరసిజనాభు రూపులై పరబ్రహ్మ స్వరూపులై - సాక్షాత్కరింతురు పరిపూర్ణ మానవుడవైతే....! |
| 63. | నాదరి జేర భావం ఉండెనేని భవమంతా భగవంతుడై దర్శనమిచ్చున్ :<br>జగముల్ వెదికి, వెదికి వేసార వలదు....! |
| 64. | నీ మానస మందున మన్మనోహర మదన మోహనుండనై..మురళీరవ గీతికలు,<br>మృదు, మధుర తరంగిణి, తరంగములై ..మాధుర్యమున్ ఝల్లున జిలుకుతు, వెన్నెల వాకిలై<br>నా పిల్లంగ్రోవి పిల్పులన్, విని పరవశింపన్ నీవేమి మరి గోరవు....! |
| 65. | అలనాటి గోపికలై కిలకిల నవ్వులన్, కలకల లాడుచు యమునా నదీ తరంగ వాహినులై<br>తటిల్లత తనువులు తరియించగ..వత్తురు,  సృష్టంతా నా మురళీ రవ గీతికలు కాదే...? |
| 66. | నా నామ సుధారస మధుర పాటలు సేయ మరి కోరరు, ఏ ఇలవేల్పులున్ మెచ్చి, కోర్కె నిత్తుమన్నా !<br>మిము బ్రహ్మ స్వరూపమున్ జేర్చగ మరి కోరగ నేర్తురే ! మధుర మధురిమల్....! |
| 67. | ధర్మము తప్పి, చరించకుడీ..నా దర్శనమంద గోరినన్ శరణన్న సంతుష్టుడ నవుదు,<br>పరిశుద్ధాంత పరితప్తులై మీ, మీ కర్తవ్య పాలన చేసి మీ, మీ విధులన్<br>సక్రమంబునన్ నిర్వర్తించుచున్, కర్మమునన్, క్రమముల నన్ గను శ్రీరంగనిసన్నిధానమున్....! |
| 68. | మతి లేక గతులు తప్పుచు..యతుల్ వేషము వేసుకున్, పగటి రంగుల్ పూసుకున్<br>మాత్రముననే మనమునందున స్వామి ..చరణములందు పొందు లభింప లేదందున్....! |
| 69. | శరీరమున్ దాల్చిన ధర్మ కర్మముల్ సక్రమంబున నిర్వహించు ! సంసారమున సతీ, సుత, మాతా, పిత,<br>బంధువుల్, సంబంధముల్ తప్పవు.. తప్పించుకొన జూడకు, అది తప్పే సుమా....! |

| | |
|---|---|
| 70. | నీ విధులను నీ కంటక నిర్వర్తించి, కమలా కాంతున్ జేరిన నాడే<br>కాంతున్ నిను ఒక కంటన్ కలతన్ వలదు....! |
| 71. | ఎవ్వరికి ఏదెంత ఋణమో నది దీర్చకన్, ముక్కు మూసుకున్న ముముక్షువు కాలేవే నాటికిన్....! |
| 72. | ముక్కంటికైనన్ ముదమున సతులిద్దరు..ముందర నిల్వగ తప్పెనా ఋణాను బంధముల్<br>శ్రీదేవి, భూదేవులన్ గూడి..సుదర్శనుండు సుదర్శనచక్రం నడిపింపంగ లేదే..లోకాలున్ ? |
| 73. | పుట్టిన ఋణముల్ తీర్చు తల్లి దండ్రులకున్, తాళి కట్టిన ఋణముల్ ఆలికిన్ నొప్పున దీర్చు..నీ కడుపున<br>పుట్టిన ఋణముల్ పెట్టుడు ముద్దలన్, పట్టులకు దీర్చు, ఇప్పట్టున దీర్చు ఋణ విముక్తుండవై....! |

(4) (13-10; నలభై ఐదవ రోజు)

| | |
|---|---|
| 74. | ఆ పట్టున నీ పుట్టుక నిచ్చిన భగవంతుని సేవించు..ఈ ఋణ, రణగోడుల్ సద్దు మణగన్<br>సద్గురు సాయిని జేరి తరించుమా..సృష్టిన్ నే ప్రాణిన్ నిన్ జేరదు..ఋణానుబంధము లేకన్....! |
| 75. | కుక్కకు పెట్టెడి పట్టెడు మెతుకులు, పిల్లికి పెట్టెడు గుప్పెడు బిచ్చము, భిక్షకు పెట్టు దోసెడు బియ్యము<br>ఏనాడో నువు పెట్టొచ్చిన నప్పుల్..ఈనాడు దీర్చుకొనుటే ఒప్పుగ శిష్యా....! |
| 76. | ధన, ఋణ బంధముల్ దీర్చి ముక్తుడైన నాడే ముక్తుండ వవుదువు..ఈ ఋణ సంకెళ్ళ మధ్యన్,<br>మునివై ముక్కున్ మూసుకొనంగ ఋణ సంబంధములు ఊపిరి సల్పనిచ్చునే, నిను ఉర్విన శిష్యా....! |
| 77. | కనుల్ మూసిన కాన్పించున్ తీరగలేని అప్పులు..కాంచగలేవు శ్రీనాథుని పదమున్<br>పద, పద నీ ఋణ సంబంధములు..సరసర దీర్చుము, సగుణమతివై..<br>ఆపైన భక్తి గుణముల గూడ భగవంతుని సేరంగలవు నిర్గుణుండవై....! |
| 78. | నీ గుణ, గణముల నే చిన్న బుచ్చంగ లేదులే ! చిన్నన్నా ! చిన్నబోకు నీ గుణము, అవగుణము నరగణమని<br>నాకున్, గణ, గణమని గంటన్ రొట్టి కొట్టినట్టు ఆనాడే అవగతమయ్యె అడుగడుగున గుడిగంటలు<br>కొట్టుచు, ప్రదక్షిణ, దక్షిణ దక్షతలేక చేసినన్ నా దగ్గర దారి గానగ పోవు....! |
| 79. | నీ ధర్మముల్ కర్మముల్ బాపుకొని సధర్మమున నిలచిన నాడే నీ దరిన్ నన్ను దరియంగ వచ్చునే....! |
| 80. | శివాయ విష్ణు రూపాయ, విష్ణాయ శివ రూపాయ అన్న నర్థంబు వికటమతివై<br>నువు చెప్పిన అర్థములు చెప్పనా ? బహు చతుర మతివని నే ఒప్పుకుందులే ! |
| 81. | శివునికి, విష్ణువుకున్ నౌకరి కొకరు, రూపాయ అప్పున్ దీర్చిరని నీవు చెప్పిన నర్థము నీకే సెప్పితి, అర్థము<br>కానిదది నా కర్థము గాక గాదే ! అర్థము చేసుకొన్నచో కాదు అనర్థ దాయకము....! |
| 82. | 'శివాయ విష్ణు రూపాయ' ఆ ముక్కంటి గళములో..శ్రీవిష్ణు నామం మనంబులో శ్రీవిష్ణు రూపం<br>విష్ణాయ శివరూపాయ — సాక్షాత్ విష్ణుమూర్తి మనంబులో<br>ముక్కంటి రూపంబు ముద్రించు కొనగ శివనామము బల్కెన్....! |

| | |
|---|---|
| 83. | ఒకరి నొకరు రూపంబుల్ మది హత్తించు కొనంగ కారణ మేమందువో<br>నీ మతికిన్ నే మాత్రమందునో ఒకపరి అర్ధము చెప్ప....నే అర్ధింతున్....! |
| 84. | ఆదిదేవుడున్ నొకరికొకరు రూపాయలన్ అప్పులు నొప్పుల దీర్చిరంచు వికటంబుగ అర్ధంబు సెప్పెదవా!<br>వ్యర్ధంబౌ నీ జన్మకు అర్ధము తప్ప, నీకేమి తోచునో చెప్పుము వ్యర్ధము సేయకు....! |
| 85. | అడుగడుగున తీరని అప్పుల్ తీర్చగ లేని జన్మ, గతజన్మ ఋణ సంబంధ వలయంబుల్ చుట్టు నిండ కన్నుల్<br>మూసి ధ్యానించి అప్పుల తిప్పలు కాన్పించునే గాని ఆనంద బ్రహ్మ నీ అవనిన్ అనిపించునా....! |
| 86. | పుట్టిన బిడ్డవై పుణ్య పురుషుండవై నీ పైనన్ బట్టన్ లేకున్నన్ దివ్యాంతర మూర్తివై<br>నా దత్త దిగంబర రూపము అంబరమంతా ఆనంద బ్రహ్మమై ఆక్రమించ అర్తిన్ వేడుమా....! |
| 87. | నిన్ పట్టన్ శక్యమా ! నిన్ కట్టన్ నే పాశంబులకు నరకి..సృష్టిన్ సర్వప్రాణుల్ సాక్షాత్కరించు<br>శ్రీమన్నారాయణరూపుడై..జ్ఞానివై బ్రహ్మన్ గూడుము, అజ్ఞాన మందు మగ్గుచు<br>అందంగ లేవు బ్రహ్మ రూపుడన్....! |
| 88. | ఈతన్ రాక నీటన్ మునిగినన్ మున్నీటన్ మునిగిన బంధముల్ తీరకనే ఈశున్ నెట్టు చేరుదువు,<br>నట్టిట్టవుదువు గాని నట్టేట మునగ నేర్చిన పట్టుము ఈశ్వరుని పదములు గట్టిగ పట్టవున్....! |
| 89. | సప్తస్వరము లెన్నియైనన్ నేక రాగమై నా పిల్లంగ్రోవినన్, నానా మతముల భక్తులు నారాయణ రూపులే<br>నమ్మి నీవు చరించినన్ : ముక్తి నందుదువు నానా విధ భక్తులన్, రక్తులన్ జేయు ముక్తులన్ జేయు<br>బ్రహ్మానంద, ఆనందకంద, మకరంద భక్తానుగణము ఏక గణమై ఒకే గుణమై నొప్పారన్ అనురక్తులను<br>కనుగొంటే, కనవింటే, పరవశత్వమున్ నందన్ పరబ్రహ్మన్ ఐఖ్యతన్ జేరు పరమానంద స్వరూపులై....! |
| 90. | ఓం నమఃశివాయ ఎన్నక్షరము లైనన్ ఏ అక్షరము..ఏ అర్ధము స్ఫురించినన్,<br>అక్షరక్షర, మనేకాక్షరములై ఏక, అనేక, మనేక, మేకమై ఏక రూపమున్ బాసించు<br>బ్రహ్మన్, ఐక్యమై సమైక్యతన్ బ్రహ్మన్ జేరు పంచాక్షరియై పలికింతు అక్షర మక్షర మక్షమై....! |
| 91. | ముముక్షువుల్ ఏదారిన్ వచ్చినన్ నవవిధ భక్తుల్ నానావిధ నానా రకముల నల్పినన్<br>కాయమునందు మస్తక మొక్కటే గదా ఏ దృష్టుల్ నాసాగ్రమునన్ నిల్పినన్ నా దృష్టిన్ జేరు<br>నఖ, శిఖ పర్యంతమున్ మస్తకమందు మోక్షమందన్ బ్రహ్మాంతమై....! |
| 92. | సాగరమందు సర్వ కాల్వల్ , పిల్ల కాల్వలన్ తరంగిణి కలుపుకొని వేదాంత పరమై ఇహమున్ దాటించు<br>తర, తరంగిణి మహానదియై సంసార సాగరంబునన్ తరింప జేయ<br>లయింప జేయునే, సాగరమున జేరు, కడసారి ధామంబదియే....! |
| 93. | అక్షర, మక్షయ లక్షల అర్ధాల్ సృష్టించినన్ ఏకాక్షరమై 'ఓం' కారమున్ లయించి, నాసాగ్రమున్ నిలిపిన<br>మస్తకమందు మరిన్ని దారులన్ నేకంజేసి, కపాల మోక్షమందించు నవ విధాతన్, శూలిన్, పాలిన్<br>నేకం జేతు, నేనా పరబ్రహ్మనే....! |

| | |
|---|---|
| 94. | నీ కాయమున లేవే కనిపించని క్షేత్రములు అణువణువున్ నొక దేవత అధిష్ఠాన మూర్తియై<br>వసించి యున్నది, గమనించ గమన గతులన్ పంచాక్షరియై నీ పాప సంచితముల్ కరిగించి<br>నీ వశంబై బ్రహ్మన్ జేర్చు, పరమ సత్యమున్ అందించున్ కాదే పరిజ్ఞానివై నవలోకించుమా....! |
| 95. | నవ నాదముల్, నవ వేదముల్, నవ భక్తిమార్గముల్, నానావిధ రూపముల్, నానా భగవన్నామముల్,<br>సప్త స్వరముల్, నానా గణముల్, నానా గుణముల్, నానా, అక్షర లక్షల్, నానా విధ గోత్ర<br>సంభోద్భవుల్, మునుల్, సురల్, దివిజుల్, దనుజుల్ ఆ పరబ్రహ్మన్ గలిసి లయ మొందుదురు<br>నొకే పరంధామమున్ జేర్తును, నా సన్నిధానమున్....! |
| 96. | కనుకను, కను కను, నీ పంచేంద్రియములన్ కట్టుము ఒక త్రాటిని, కనిపెట్టుము వివిద దారులన్ పోనీక,<br>మస్తక మందు అక్షర మేకాక్షర మైన 'ఓం' కారము నేకము చేయ నీ బుద్ధిన్ సుబుద్ధినై రయమున్<br>చేర్పించు రథసారథినై....! |
| 97. | మ్రుచ్చు, మ్రుచ్చులు తొంగి చూడగన్, మృత్యుందారుల జేర్తురు బోలికన్, ఓంకారమున్ ఉగ్గం బెట్టి<br>నాసాగ్రమున్ నేకము చేసి, రమించు నాదగు నానా రూపములన్, నొకే విధ రూపుండైన స్వరూపుండ<br>ఆ విధాతన్ ఐక్యము చేయు చివరి ధామంబదియే....! |
| 98. | గానముల్, నామ పానముల్, పురాణముల్, వేదముల్, భజించు భజనల్, సంకీర్తనల్, కీర్తుల్<br>సురుల్, భూసురుల్, గిరుల్ తరుల్ వాక్కున్, జపముల్, తపముల్, తపోనిధుల్ మనుజుల ఏకంబునై<br>ఐక్యతన్ ఒప్పారు ఆ 'ఓం' కారమున్ ఒకే గళమున్, నొకే రవమున్ నినదించు మీ చివరి ధామం —<br>ఆ పరబ్రహ్మ సన్నిధానము జేరి పరబ్రహ్మ స్వరూపులన్ కండి..ప్రమోదాంకితల్ బ్రహ్మాంకిత స్వరూపులై బ్రహ్మ<br>స్వరూపులై బాసిల్లగన్, భావన సేయుడీ....! |
| 99. | భవము దాటించన్ నావికుడై నే నొత్తున్, కర్తన్, కర్మన్ నేనై దాటింతున్ దిగులున్ పొందెదవేల<br>నిస్సారుడవై ! నిర్గుణమూర్తినై సర్వగుణముల్..నాలో లయించి ఉన్న వాడనే నీ దుర్గుణముల్ మాన్ప<br>సమకట్టితి....! |
| 100. | బ్రహ్మంజేరి పరమానందము నొంద..సంకల్ప మతివైతే శుభకరము జేతు నీ జీవితము<br>శుభస్య శీఘ్రం, నిర్ణయము అందు ఈ నిముషము....! |
| 101. | సంగీత మాధురుల్, వేద వేదాంగ జ్ఞానముల్, పురాణముల్..గీతాపారాయణముల్, పంచాక్షరి<br>మంత్రముల్, అష్టాంగ యోగముల్..కష్టాంతర యోగాభ్యాసముల్ ఆ జన్మాంతర ముక్తికై<br>ఆ పరబ్రహ్మన్ జేరు పరమ మార్గమున బ్రహ్మానందము నంద....! |
| 102. | నేనొక రూపమై, గుణమై, ఆనందమై, రాగమై, బాసించున్ భావింప జ్ఞాన మతి వపుదు వేని....! |
| 103. | బజారునన్ బేరము లాడినన్ జీవితము కుదువ బెట్టినన్, అక్షర అక్షరమునకు లక్షల కోట్లిచ్చినన్<br>దొరకనిది నీ నధికారమునకున్, తల వొగ్గనిది, ఈ బ్రహ్మను వేదం పరబ్రహ్మ నాదం..పరిశ్రమించుటే...! |

| | |
|---|---|
| 104. | పావన మూర్తిగ సేయు దగ్గర దారులన్..దొంగవై జూచినన్ — దొరుకునదా, ఇది<br>నీవిచ్చు, ఐదు రూకలకున్ నీ తేలిక బుద్ధిమాను నీ నాలిక పర నిందల్ చేసి మొద్దుల్ బారే....! |
| 105. | వీనుల్, విన నిందల్, సుద్దుల్, నా సుద్దుల్..విన్పించగన్ లేవు..పరుగులు మాని పరిశ్రమించుటే కర్తవ్యం..! |
| 106. | కర్మల సాక్షినై, కపాలినై, కమలాక్షునై, పాలినై, శూలినై, సూర్య చంద్రులనై, అష్ట దిక్పాలకులనై,<br>పితృదేవతలనై, ఇలవేల్పుల్, ఇష్ట దేవతల్, భువనముల్, నభోనాంతర మందుదాక జ్వల జ్వల రగిలించు<br>అగ్నినై, అగ్నిన్ మ్రింగు జలధారల వర్ష ఋతువునై, క్రతువునై, మునుల్ సేయు తపోనిష్టనై,<br>ఏకాక్షరమునై, అనేకానేక అక్షర అక్షయ బ్రహ్మ రూపినై, ఐక్యము నన్ 'ఓం' కారమై<br>ఒప్పుచు నొప్పినన్ ఏకాక్షరి మంత్రము జపించుట మార్గము సుమ్మీ....! |
| 107. | అడ్డదారులన్ సేరగ లేవు, నీ గార్ధభ బుద్ధుల్ మానెదవేని, మంచిగ చూపింతు నా సన్ని దానమున్ ఓండ్రల్<br>పెట్టకు, గాండ్రింపు లేటికి ఆ గార్ధభమైనన్ వేదములకున్ పరవశింపదే ! |
| 108. | పట్టుము గార్ధభ పాదాలున్, ఘటాలున తన్న, కనిపించు పరమాత్మ బ్రహ్మను చేరెదవని పరమ కష్టముల్..! |
| 109. | కష్ట, నష్టముల్, దుఃఖముల్, దురితముల్, అవమానముల్, అనుమానముల్, భాగ్యము, భోగ్యమున్<br>హెచ్చున్ తగ్గున్ నుండంబోవు బ్రహ్మలో, ఆ పరబ్రహ్మ నాదాను నాదములై, బ్రహ్మ వేదములే<br>వినిపింతును..చేరుము బ్రహ్మన్, ఆ విధాత ఒగ్గుల్ సెప్ప, నేర్పును నీ సాయినాథున్ |

(5) (14-10; నలభై ఆరవ రోజు)

| | |
|---|---|
| 110. | సకల చరా, చర సృష్టిన్ సకల ప్రాణులన్..చతుర్ముఖుడనై సృష్టించునది నేను కాదే....! |
| 111. | పరమైన అక్షర మైనది : బ్రహ్మము తన స్వరూపము చేతన్ చేతనుడై<br>జీవాత్మ అధ్యాత్మమని చెప్పంబడి ..చెప్పెద నీ చెవినన్ రెండక్షరముల్....! |
| 112. | ఈ సృష్టిన్ చేయు త్యాగం బేదో .. అది కర్మమని ధర చెప్పబడున్ : అది భూతములందు<br>అది దైవమై వెలయు చతుర్ముఖ బ్రహ్మనైనాను.. నన్ మీ దేహ దారుల్ దర్శింతురు గాదే.... ? |
| 113. | శరీరమునన్, ఈ శరీరమునన్ .. అంతర్యామినై ఆధిక్య రూపమున్ అలరి ఉంటిని కంటే....! |
| 114. | సదా నన్ను స్మరింపుము అవుదువు చిదానంద మూర్తి, చిరస్మరణీయుడవై చిరంజీవివై వర్ధిల్లు ధరలోన<br>అంతవరకున్, వరంబులనిత్తు..నీ అంత్యకాలమునన్ స్మరింతువేని, పుణ్యలోకాలన్ జేర్చుదునే,<br>పురుషోత్తముడనై...! |
| 115. | మనసునన్ నన్ సదా తలంచుచు.. నీ తలపునన్, పిలుపునన్ చేతన్, రాతన్<br>సదా నా స్మరణం, స్ఫురణం, శృతి, స్మృతి..కల్గిన వానిని, జేర్పింతు మరలి రాని లోకాలకున్.....! |
| 116. | మీదగు అంత్య కాలము..నన్ దలంచుచు ప్రాణముల్ వీడెదరేని<br>సాక్షాత్ శ్రీ మన్నారాయణుండనైన నా స్వరూపమున్ పొందగ నిత్తున్....! |

| | |
|---|---|
| 117. | అంత్య కాలమునన్ మీ భావనల్..నే పగిది భావింతురో, బ్రతుకనంతరం<br>ఆయా భావంబునన్ భాసిల్ల గలరు..సదా స్మరించుడీ ! సదానంద రూపున్....! |
| 118. | ఇహముల్, పరమున్ నా ఇందిరా రమణున్..తలంతువేని, నిక క్షుద్ర జన్మలుండునా....! |
| 119. | సదా పరమేశ్వరునిపై ధ్యాస, పరమాత్ముని ధ్యానం..చిత్తమున్ నిరంతరాయముగ ఆ గోపాలుని చెంత చేర<br>చింతనల్ చేసితి వేని ..మానవుడు పరమ ప్రకాశియౌ ఆ మాధవున్ నందం గలడే....! |
| 120. | ఎంతెంతలు నే చెప్పిన..నీ మది చింతల్ మరింతయ్యే<br>ఇసుమంతన్ ఇంగితమున్న..విను, సాయీశ్వరుని సుద్దుల్ బుద్ధుల్....! |
| 121. | మీదగు అంత్య కాలమునన్ ..ఏ దేవుని స్మరింతువో? ఏ కాలమున్ మరణింతువో..?<br>ఆయా కాలముల అధిదేవతల అనుగ్రహమునన్ పుణ్యలోకముల్ సేరం గలవు....! |
| 122. | నీదగు పుణ్య కాలమున్..కరుగు నందాక చంద్ర జ్యోతివై<br>శరత్ చంద్రికల వెల్గుల జిమ్ముచు, పుణ్యకాలంబంత కరుగున్ మరి పునర్జన్మ నిత్తున్....! |
| 123. | తత్వపరుడవై పరబ్రహ్మన్..తలిచెద వేని పునర్జన్మన్ లేకుండగన్<br>బ్రహ్మమునందు లయింపజేతు..నీ భావం బెట్టిదో మీ బ్రతుకుల్ భాసింప జేతున్....! |
| 124. | తత్త్వం అర్థం కాదంచు..తెల్ల మోహమున్ వేయకు, తల్లడిల్లకు<br>ఏ భాషను చెప్పెదనే భాష్యమైనన్..ఏ పగిదిన్ భవబంధముల్ దాటించుట ముఖ్యమౌ....! |
| 125. | నీ దగు స్వస్థలముల్ చేర..మీ నరులు అనేక మార్గముల్ పయనింతురే !<br>ధూమశకటముల్, కారుల్, ఎడ్ల బండ్లన్, ఆకాశ, విమాన యానముల్ మీ, మీ స్థితులన్ బట్టి<br>స్వస్థలముల్ జేరెదరు ప్రయాణ సౌఖ్యమున్....! |
| 126. | కాల మానంబునన్ అనుసరించి కాలంగతి బొందెదరేని..ఆయా కాలములకున్ అధిష్టాన దేవతల్ నావికులై<br>నానా లోకముల్ చేర్తురు నీ పుణ్యము నెంచి పంచగన్..ఏ తీరున, నీ తావున నీవెట్లు సౌఖ్యమునన్<br>సఖుడివై జేరుదువో నట్లు చేర్చెద పరంధాముని పదములన్, పరిదారులన్....! |
| 127. | మాసమునకు పక్షముల్ నొచ్చు, ఎంచితివేని..కృష్ణ పక్షమున్, శుక్ల పక్షమున్..<br>కాలములు దక్షిణాయణ, ఉత్తరాయణ కాలము అసువుల్ వీడెదవేని<br>ఆ పుణ్యం అనుసరించి నానా విధముల్ ఆయా కాల అధిష్టాన దేవతల్..చేర్పింతురు పుణ్య లోకముల్....! |
| 128. | జ్ఞాని విజ్ఞానం నొప్ప..మనమునన్ మాధవు దలచుచు పుణ్య కాలంబు వరకున్<br>పునః పునః పురుషోత్తమున్..జపించు చుండునే....! |
| 129. | అర్ధము కాదని ఏడ్వకు..నే ప్రతి పద మర్ధము విడదీసి జెప్పెద<br>బ్రతుకున్ వ్యర్థము సేయకు..పెదర్థము అందకుంటి వేని పెరుమాళ్లున్ సేరు, దారి దగ్గరే....! |
| 130. | నీదగు పుణ్యము కొలదిన..కలిగిన భాగ్యము కొలదిన్..మీమీ విభవములు కొద్ది వైభవంబునన్ |

| | |
|---|---|
| | మొదటి, ద్వితీయ అధమ మార్గములన్ ప్రయాణ సౌఖ్యమునంది జేరుదురు మీదగు స్వస్థానముల్....! |
| 131. | జ్ఞాని కోరడెన్నడు సుఖ సౌఖ్యముల్..పుణ్యగతులన్, పుణ్య లోకంబులన్<br>పుణ్యం అనుభవింప నొల్లక బ్రహ్మము జేరు..పరమానంద గతుడై మరి పుట్టంగ లేడా పునర్జన్మలన్....! |
| 132. | చచ్చేడి వరకు చచ్చేడి చావులకై..క్షణ క్షణముల్ చచ్చి బ్రతుకుచున్..చచ్చేడి రోజు మతి చాంచల్యము నొంద<br>చావు భయమునన్ ఒంద గలవే మాధవుని పొందు, చిటుక్కున చచ్చేదవు చావు భయంబునన్....! |
| 133. | క్షణికమౌ బ్రతుకునన్..మోహావేశముల్ దుఃఖపు తెరలు మూడొంతులు ముంచగన్ !<br>క్షణమైనన్ ఆ క్షీరసాగర శయనున్..తల్వక క్షీణింతువు — బ్రతుకు నిక్షేప మంచున్....! |
| 134. | క్షామము లంద నీ బ్రతుకున్..శ్రీ మన్నారాయణ సంకీర్తనల్<br>అరక్షణమైన చేసెదవేని నీ కర్మ సంచితముల్ కరగ సంప్రోక్షణల్ చేతునే....! |
| 135. | చచ్చేడి క్షణముల నైనన్..నీ నాలుకన్ లక్ష్మీపతి నామము సేయ లయింతువే నీ పుణ్యమున్నన్ !<br>బ్రతికిన వారి కొరకై భవబంధముల్ తెంచుక పో క్షణమైన భగవంతుని తల్వక ఏడ్చెదవు....! |
| 136. | ఈ పగిదిన్ క్షణ మరో క్షణమై వారున్ వత్తురు చత్తురు కాలమాసన్నమైనన్<br>కాలమున్ కరగక చిరంజీవులై శిలల వలె ఏ జీవు నుండ నేర్తునే....! |
| 137. | అలికి ఏడ్చి, ఆకలి కేడ్చి, అర్ధాయుషుల కేడ్చి అర్థంబు కేడ్చి ఆర్థిక బాధల కేడ్చి<br>పుట్టగ నేడ్చి, చచ్చుచున్ ఏడ్చి, ఏ రీతిన్ నీ కొచ్చు పుణ్య పథముల్? |
| 138. | ఏడేడు భంగిమల నీ ఏడ్పుల్ ఏ దేవుడు మెచ్చి, నిచ్చు పద కైవల్యంబున్....! |
| 139. | కన్ కన్ కను కను..కన కమలాకాంతున్ కనక పుష్యరాగమై<br>కనకమున పొందగ బడి కాంతుల విరజిల్లగన్....! |
| 140. | జన్మంబు లేని నిజ జనకున్, విశ్వవిభున్..సాయినారాయణుం దలవగ తరింతువే....! |
| 141. | నీ తలపున పిలుపున..మనమున నీ స్మరణము – స్ఫురణము 'సాయిన్' తలపగ<br>నీ బ్రతుకు సఫలతన్ తరించ జేతును సత్సంకల్పము నీకున్ ఉంటే...! |

(6) (15-10; నలభై ఏడవ రోజు)

| | |
|---|---|
| 142. | సర్వ జీవుల సమవర్తి అవుదు నేను..సర్వులను సమముగ గాతు నేను<br>జీవులెల్లరు సములు ధరణిలోన..ద్వారకన్ నొకపరి దర్శింప దయను జూతు....! |
| 143. | ఆర్తులైన నేమి? నిరు పేదలైన నేమి? శిరిడీ సాయిని దర్శింప సర్వ సిరుల వర్ధిల్లు<br>శాంతి సౌఖ్యాల నొందగా శ్రీసాయినాథుని శిష్యులైతి రేని<br>సములు ప్రియ శిష్యులు నాకు అత్యంత ఆత్మీయులే పరుల్ గాదు....! |

| | |
|---|---|
| 144. | నా దర్శన కాంక్షతో దారికొచ్చు భక్తుల నే సందర్శింతు క్షేమంబు నడిగి<br>చింత లేటికి నా చెంత చేర సాయినాథుని పదమే శాంతి సన్నిధానం....! |
| 145. | కలిమి లేటికి నీకు నను కలసి చూడు...కాంక్ష లేటికి నీకు..నా దర్శన ఆకాంక్ష చూపు<br>కాంక్ష వీడంగ జేసెద..నా కరుణా కటాక్ష వీక్షణంబులో..అన్ని కలిమిలు కలిగిన కలుగునా శాంతిశ్రీలు....! |
| 146. | కోరన్ నీ కడ కాసులన్..వీడన్ నొకపరి పదమంటి శరణంటివేని<br>కర్మన్ బాపి కడతేర్తు ..శిరిడి నిలయం కంటివేని....! |
| 147. | పిడికెడు బిక్షం బడిగి లక్షల కామితంబు నిచ్చెదన్ అక్షయ పాత్ర కాదే నా చేతి చిప్పన్....! |
| 148. | చెప్పన్ నే నిజముగ లక్ష్మీపతినే ! ఐనన్ బిక్షం ఇంటింటికి ఎత్తిన<br>కారణం అరయగ లేవైతివేని....! నీ నెత్తిన మొట్టనా ! తిట్టిన తిట్టు తిట్టక తిట్టెదన్....! |
| 149. | నా తిండికి లేక తిరిపంబెత్తి బిక్షం పట్టితినని పదే, పదే ఏల ఏడ్చేవు !<br>తరచి, తరచి చూచినన్ పడుదువే నేల పరమార్థమున్ కానగ నేర్చదవే....! |
| 150. | తింటున్, తాగుతున్, చూచుచున్, పిల్చుచు, పాడుచు, ఆడుచున్, నిద్రించుచున్, సర్వవేళలన్, నీ మానస మందు సాయినాథుని నిలిపితి వేని, సదా సంరక్షించి ఆ వైకుంఠనాథున్ ధామమున్ చేర్చెద గాదే....! |
| 151. | ఏ వేళ, ఏ రూపు, ఏ దేవత, ఏల పిల్చినన్.... ఆ లీల, ఈ లీల, నీకు చూపుదున్<br>సర్వజగతిన్ సర్వ జీవాత్మలకున్..ఈ పరంధాముడే పరమాత్మ గాదే....! |
| 152. | పరమాయలంబడి పరుడవై..పరంధామంబునకున్ దూరంబైనన్..భగవంతు నామం పదే, పదే పల్కగన్..ద్వారకన్ దర్శింప సర్వ దారిద్ర్యముల్ హరింతు..నీ దరి నేనే ఉండు, నా దరికి చేరు....! |
| 153. | నాలుగు ద్వారముల్ తెరిచితి..నాలుగు గుణముల నరులకున్<br>నానాటికి క్రుంగగ నేల..? నాదగు ద్వారక వచ్చి, శరణు జొచ్చుము....! |
| 154. | జనించగనే మానవుల్ ఆ ఉత్తమ గుణ సంపూర్ణ, సద్గుణ సంపన్నుల్ కారెవరున్<br>స్వర్ణంబైనా పుటము పెట్టగ ..కూర్చుకొను జిలుగులు వెలుగులు....! |
| 155. | నా దరి వచ్చు మానవుల్, నొచ్చిన మనసు వారే ! నను మెచ్చి తరించన్ రారెవరు, సంపూర్ణ భక్తుల్....! |
| 156. | కాంక్షల్ కళ్యం నింపుకొన్న..కామితముల్ తీర్చెద..సరి దిద్దెద తలక్రిందులైన వారి జీవితాలన్....! |
| 157. | సర్వస్య శరణాగతులు చేయి, సద్గతుల్ కలిగింతు, గుణముల్ సమము చేసి<br>సమానర్థతన్ నిత్తున్ సాయినాథుని సుందర ఘున శ్యామున్ చేరు మార్గమున్....! |
| 158. | కోర్కేన్ లేక నాదరి చేర రెవ్వరున్..కామితముల్ తీర్చినన్ కోరి భజించ<br>భక్తులన్ తీర్చి, దిద్దెదన్ ! కామిన్ గాక మోక్ష కామిన్ కాగలడే నరుడు....! |
| 159. | నాడు అసురులున్ అంతం బొందించితి..నేడు ఆ అసుర గుణముల అంతరించిన నరులన్<br>అడుగడుగునన్ అంతర్హితున్ చేసి ..నరులన్ సురలన్ కల్పుదు....! |

| | |
|---|---|
| 160. | అపై గదా నన్ చేరు ఉత్తమ గతుల్..అందు ఉత్తమ పురుషుడ వవుదు<br>తరగతి దాటినన్ కదా.. భవతరణిన్ దాటి నన్ జేర అర్హుండవౌ....! |
| 161. | క్రూరాత్ముడైన అజామిళున్..కన్నున్ గానక అజ్ఞానమునన్..చేయని పాపముల్ చేయగ<br>చేసిన పాప కర్ముడైనన్ ..తుది శ్వాస వదులు సమయంబునన్..'నారాయణ' అనుచు ఆత్మ తలపించినన్<br>ఏ రీతి ఏలుకొంటిన్, ఆ రీతిన్ ఏలెద నరులన్....! |
| 162. | ఏటికి చింతనల్ చేయకు, ఏలెద సరిపాటిన్ చేసి<br>చేసిన తప్పుల్ మరి సేయక ఉంటివేని, పరితప్తుడా, పరిపాలింతు, పదే, పదే చెప్పన్....! |
| 163. | ఆ పురుషోత్తమున్ జేర్చ ఉత్తమ గతుల్ తీర్చి దిద్దెదన్..నాడు ఆ అసురుల్ నూటికి పదిమందున్నన్<br>అకృత్యమున్ ముంచ లోకముల్ గడగడ లాడించ అవతార మెత్తితిన్..ఆ మృత్యువుకు భృత్యున్ జేసితి....! |
| 164. | అయినన్ అజ్ఞానము కమ్మినన్..నాడా రాక్షసుల్ తపస్సంపన్నులే !<br>వర గర్వంబంది వరించిరి మృత్యువున్ ! నా చేతంబడి సఫలత గాంచిరి....! |
| 165. | లోక కంటక రాక్షసులన్ ఏరి, ఏరి పరిమార్చితిన్..నే అవతార మెత్తినన్ ఆ కారణంబుకే<br>నేడే కలిన రాక్షసుల్ అంతర్హితులైన నేమి ..వాళ్ళసురుల్ వదలుతు అసుర గుణముల్ మీలో నింపిరే....! |
| 166. | అసురులకున్, సురులకున్, నరులకున్..పలుకు, పలికిన ఒక్కొక్క అక్షరంబే తేడా లొచ్చున్<br>ఒక్కొక్క అవగుణంబు అంతర్హితం చేసితివేని.. నరుడా నీ వపుదువు నారాయణుండవే....! |
| 167. | అందుకే, నే నందుకే.. ఆ నంద నందున్ పొందున్.. మీ జీవిత మందున్ కల్గించ భువి కొచ్చితి....! |
| 168. | అసురులే అందిరి పరమశివుని అనుగ్రహము తపస్సంపన్నులై !<br>మంచిన్ పంచగ లేవు..జపతపముల్ సేయగ లేవు....! |
| 169. | అసుర గుణముల్ అంతర్లీనమైన నేమి..నన్నందన్ నీ అందున్ ఏ గుణముల్<br>రవళించె మానవ గుణాగ్రణి ! సత్ గుణములు తప్ప, అన్నిన్ నీవు మెచ్చం వచ్చునే....! |
| 170. | "లేరీ నాటన్ లోక కంటకుల్"..అన..నిశ్చింతన్ ఏ నాడైనన్ మిగిల్చిరే నరుల్..ఆ రాక్షసాధము<br>తమ కృత్యము అకృత్యముల అను క్షణముల్ రాక్షసుల మంచు చెప్పిరే ! నే మెచ్చిన గుణ మదొక్కటే....! |
| 171. | నామ, రూప, వేష దారుల్ ఈ నరుల్..రాక్షస గుణముల్ మదిం తొక్కి..<br>భజన పరుల్, భక్తుల ముసుగుల్ ధరించిరి..ఆ ధర ఏ పగిదిన్ చరించినన్ ఆ ధరాధర ధరా ఇలాతర<br>ధరాధరంబులకున్, జగన్నాథుండ నా కన్నులన్ కప్పి — మీ ముసుగుల చరించ నేర్తురే....! |
| 172. | తరించ మార్గం బది కాదు మీ తలపులన్ తప్పులున్న సరిదిద్దెద.. సర్వస్య శరణాగతి అందు వేని<br>గత, గతాను భవంబున్ గీతామృత సారములన్..కర్మ యోగంబులన్, ధర్మా ధర్మంబులన్<br>యుగ యుగాంతముల నాదగు అవతారమున చెప్పిన రీతిన చెప్పక, చెప్పితి ఈ నాటి వరకున్....! |
| 173. | చైతన్యము కలుగు నంచున్ పుక్కిట పురాణముల్, పొద్దుం పోక చెప్పితి నంచు |

| | |
|---|---|
| | ఎంచెద వేని, తరించగ లేవు ఏడేడు జన్మలకున్....! |
| 174. | నాడు అనాది జన్మల నించిన్..తరగని సంబంధ బాంధవ్యముల్ మనమధ్య<br>వీడని బంధములున్నందునే భంగపడి బహు విధముల చెప్పిన సంబంధం మిగిలే ! |
| 175. | బహు దారుల్, బాహు వేశముల్, బహు జన్మల, బహు, బహు దూరమైతివే....!<br>నీవు నా సంబంధమున్ మరచినన్ నే మరవక అనాది జనకుండనే !<br>బహు విధముల బ్రతిమాలితి భక్తుని సేయగన్....! |
| 176. | తనయుడున్ బాహ్య క్రీడలన్, తనదగు తండ్రి వక్ష స్థలంబున్<br>తన పదముల నర్తించుచున్ తన్నడే తప్పుగా నెంచి తండ్రి తనయున్ దండించునా....! |
| 177. | ఎత్తి ముద్దాడి నెత్తినన్ పెట్టుకొన్న ఆ జనకుడే..తరుణ వయస్కుడైన ఆ తనయుడే తన్నిన భరింతునే<br>తప్పుంచెప్పి, చెప్పుతో కొట్టి... తగు రీతిగ దండింపడే ! ఆ తనయుని మంచికే సుమా...! |
| 178. | తక్కువ, ఎక్కువ చూడక, తరముల్, తరముల్ గడచిన,<br>తమ, తమ జన్మల మరచిన తరిమి, తరిమి నే చెప్పిన సంగతులివియే....! |
| 179. | తక్కువేమి మీ కీ తరగతుల్ చెప్పకున్న నే తరించనని తలపు నీకు ఏల<br>తర, తమ బేధము లెంచక తర, తరముల్ తనయుడవని తరింప సేయు మార్గముల్<br>మీ తలపుకే తెచ్చితి తలరాతల్ మార్చగ....! |
| 180. | ఆ విధాత నవ విధాతయై తిరిగి, తిరిగి నీ నుదుటన రాసిన నీ వ్రాత నేమో !<br>నీ తల గీతన్ మార్చ తర, తరముల్ నాకు బట్టె నీ తలపుల్....! |
| 181. | తలవంపులే నీకు గాని, నా కేటికిన్, నరుడా !<br>దున్న మీద జోరున వర్షంబు పగిది ..నా నీతుల్ విని తరించలేని మహిషంబు నీవే....! |
| 182. | మహిన్ మరి రాదు, మరి నిను మార్చు అవకాశంబున్<br>మది, మది తట్టి పిలిచితిని..మమతన్ మూర్తీభవించిన ఆ సాయిమాతనే....! |
| 183. | నీ ముందట నిలచిన ఆ శిరిడీ నందే అల వైకుంఠ ధామంబు<br>అలరించిన కారణంబునే మరి మరి చెప్పితిన్....! |
| 184. | మదిన్ పెట్టెదవేని మరలింపుము మదిని ఆ మసీదు కడకు మరి జన్మ లింకేటికిన్....! |

ॐ ॐ ॐ